## మైనార్టీ పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 17: జిల్లాలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి జెమ్లా నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లతో పాటు జూనియర్ కళాశాలలో (మైనారిటీలు 75 శాతం, నాన్ మైనారిటీలు 25 శాతం సీట్లు) ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు www.tmreistelangana.cgg.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040-23354064 హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 17: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ అండ్ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ కోసం ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి వంద రోజుల పాటు సంగారెడ్డిలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు ఫిబ్రవరి 12 నుంచి 14 వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు తెలిపారు. వివరాలకు 08455-277015, 9949592991 నంబర్లను సంప్రదించాలన్నారు.

## జిల్లా సాయుధ దళాల వార్షిక పునరుచ్ఛరణ

**- అదనపు ఎస్పీ మహేందర్**

మెదక్ అర్బన్, జనవరి 17: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా సాయుధ దళాలల వార్షిక పునరుచ్ఛరణ (మోబిలైజేషన్) శిక్షణ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీ మహేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి రోజూ ఉదయం ఫిజికల్ ట్రైనింగ్, పరేడ్, మాబ్ ఆపరేషన్, ఆయుధాల శిక్షణ, నాకాబంధీ, సెక్యూరిటీ ఇంతర అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఆర్ఎస్ఐలు నరేశ్, భవానీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చేగుంటకు మంత్రి,ఎమ్మెల్యే రాక

చేగుట, జనవరి 17: నేడు చేగుంటకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. వడియారంలోని గోల్డన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీజీవీబీ ఇక టీజీవీబీ

చిలిపిచెడ్, జనవరి 17: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీవీబీ)తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీవీబీ)గా మార్చినట్లు చిట్కుల్ మేనేజర్ చంపాలాల్ తెలిపారు. బ్యాంకు ఖాదారులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

## అవినీతిపై విచారణ చేపట్టాలి

దామరచెర్వు గ్రామంలో డ్వాక్రా సంఘాల సమావేశం

రామాయంపేట, జనవరి 17: డ్వాక్రా సంఘాల డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా సొంతానికి వాడుకున్న బ్యాంకు మిత్రపై చర్యలు చేపట్టాలని సంఘాల మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామస్తులు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకు సిబ్బంది సమక్షంలో మహిళా సంఘాల సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకు మిత్రను నిలదీశారు. 17 సంఘాల డబ్బులు లక్షల్లో సొంతానికి వాడుకున్నారని, తమను మోసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మహిళలు ఆందోళనకు దిగారు. బ్యాంకు మేనేజర్ భీముడు మాట్లాడుతూ దామరచెర్వు గ్రామ సహాయక సంఘాల్లో బ్యాంకు మిత్రగా పనిచేస్తున్న సభ్యురాలు బ్యాంకులో జమచేస్తానని తెలిపినట్లు తెలిపారు. బ్యాంకు డబ్బులు ఎవ్వరు వాడుకున్నా కట్టాల్సిందేనని మేనేజర్ సంఘాల మహిళలకు తెలిపారు.

## పారిశుధ్య కార్మికులకు సరుకులు అందజేత



పిల్లుట్లలో కార్మికులకు సరుకులు అందజేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట, జనవరి 17: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో శుక్రవారం పిల్లుట్ల గ్రామంలో గ్రామస్తులు, కార్మికులకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్, శ్రీశైలం, వేణు, కిశోర్‌రెడ్డి, అనిల్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, సంద్ర సతీశ్ తదితరులు ఉన్నారు.

## ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ, వాలీబాల్‌లో ప్రథమ స్థానంలో రాహుల్ టీం

చిన్నశంకరంపేట, జనవరి 17: మండలంలోని గజగట్లపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్ రెండు ఆటల్లో విజయం సాధించిన రాహుల్ టీమ్‌కు రూ.9వేలు కబడ్డీ, వాలీబాల్, రన్నర్‌గా నిలిచిన బాబు, శ్రీకాంత్ టీమ్‌లకు రూ.2 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందించారు. రాహుల్ టీం సభ్యులు రూ.4 వేలను గ్రామంలోని ఆలయ అభివృద్ధికి అందించారు.

## జక్కన్నపేటలో క్రికెట్ టోర్నీ

మెదక్ రూరల్, జనవరి 17: హవేళీఘనపూర్ మండలం జక్కన్నపేటలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నీ మొత్తం 6 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరుగగా ప్యాట్ల అనిల్ గౌడ్ టీం, మామిళ్ల విజయ్ టీంపై విజయం సాధించి, ట్రోఫీని గెలుపొందింది. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు ఎనగండ్ల యాదగౌడ, శ్రీనివాస్‌గౌడ్, యువకులు భూమయ్య శంకర్‌గౌడ్, ఏసు, సిద్దు గౌడ్, నర్సింలుగౌడ్ తదితరులు ఉన్నారు.

# ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

నర్సాపూర్: మాధవానంద సరస్వతి వద్ద ఆశీర్వచనాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే

శివ్వంపేట: గంగాయపల్లి ఉర్సులో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఘనంగా శీతల మాత ఆలయ 9వ వార్షికోత్సవం

నర్సాపూర్, జనవరి 17: ప్రతిఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీలోని శీతల మాత (నల్లపోచమ్మ) ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఎమ్మెల్యేతో పాటు భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు హరిప్రసాద్‌శర్మ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, భక్తులు పాల్గొన్నారు.

**శివ్వంపేటలో..**

శివ్వంపేట, జనవరి 17: గంగాయిపల్లి ఓంపాజిల్ నగర్ అప్ప గారి ఆశ్రమంలో నిర్వాహకులు బొట్టు నర్సింలు చిష్తి, నయాబ్ దాస్ చిష్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వమత సమ్మేళనంగా ఏటా గంగాయిపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమ్, పట్టణ అధ్యక్షుడు పంబళ్ల భిక్షపతి, మాజీ వైస్ ఎంపీపీ జ్యోతి ఆంజనేయులు, పార్టీ తూప్రాన్ మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, చింతస్వామి, సుధాకర్‌రెడ్డి, కమ్మరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే సంక్షేమ ఫలాలు అందాలి

**- కలెక్టర్ రాహుల్‌రాజ్**

నర్సాపూర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేటలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

నర్సాపూర్, జనవరి 17: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకే సంక్షేమ ఫలాలు అందజేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని చైతన్యపురికాలనీ వార్డు నెంబర్ 9లో రేషన్ కార్డు వెరిఫికేషన్, మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయానికి ఆమోద యోగ్యం కాని భూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపికను ప్రత్యేక, మండల స్థాయి అధికారులతో కలిసి పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రెండు విడుతల్లో రూ.12 వేలు, అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పారదర్శకంగా సర్వే నిర్వహణ

చిన్నశంకరంపేట, జనవరి 17: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 26న ప్రారంభిస్తున్న నాలుగు పథకాలకు అర్హులైన పేదలను గుర్తించి వారి వివరాల్లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏవో ప్రదీప్ పాల్గొన్నారు.

### కోనాపూర్‌లో జడ్పీ సీఈవో ఎల్లయ్య

రామాయంపేట, జనవరి 17: అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డుతో బాటు ప్రభుత్వ పథకాలు అందుతాయని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. మండలం కోనాపూర్‌లో జరుగుతున్న సర్వేను సీఈవో సందర్శించి సర్వేలు చేస్తున్న సిబ్బందికి సూచనలు సలహాలిచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర పథకాలు అర్హులకు కచ్చితంగా అందుతాయన్నారు. సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్, తహసీల్దార్ రజనీకుమారి ఉన్నారు.

### ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పరిశీలించిన జడ్పీ సీఈవో

నిజాంపేట, జనవరి17: మండలంలోని చల్మెడలో మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్ వివరాల సేకరణ కొనసాగుతున్నది. ఈ సరళిని జడ్పీ సీఈవో ఎల్లయ్య పరిశీలించారు. జడ్పీ సీఈవో వెంట ఎంపీడీవో రాజిరెడ్డి, ఆర్ఐ ప్రీతి, ఏఈవోలు శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు నర్సింహారెడ్డి, ప్రశాంత్, సర్వేయర్ ప్రశాంత్ ఉన్నారు.

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే పరిశీలన

శివ్వంపేట, జనవరి 17: మండలంలోని దొంతి గ్రామంలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మండల ప్రత్యేకాధికారి ప్రతాప్‌సింగ్ పరిశీలించారు.

### అధికారులు పారదర్శకంగా పనిచేయాలి

నర్సాపూర్, జనవరి 17: అధికారులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ పథకాలపై సమావేశాన్ని నిర్వహించారు. అమృత్ 2.0 పథకంలో మున్సిపాలిటీకి 13 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో కౌన్సిలర్ యాదగిరి, ఆర్ఐ సిద్ధిరాములు, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సర్వేయర్ అభిలాశ్ పాల్గొన్నారు.

### పకడ్బందీగా రైతు భరోసా సర్వే చేయాలి

అల్లాదుర్గం, నవరి 17: సర్వేను టీంతో పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ సూచించారు. శుక్రవారం మండలం మాందాపూర్, కాయిదంపల్లి, బహిరన్‌దిబ్బ, సీతానగర్, వెంకట్రావ్‌పేట్, చేవెళ్ల, రెడ్డిపల్లి, చిల్వెర గ్రామాల్లో వ్యవసాయానికి యోగ్యమైన, యోగ్యము కాని భూములను సర్వే చేశారు. తహసీల్దార్ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి రాజేశ్, ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా

**-మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా**

శివ్వంపేట, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులను బనాయించడంలో ఉన్న శ్రద్ధ పథకాల అమలులో లేదని మాజీ జడ్పీటీసీ పుబ్బ మహేశ్ గుప్తా విమర్శించారు. శుక్రవారం శివ్వంపేటలో ఆయన మాట్లాడుతూ ఈ కార్ రేసు విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమంగా కేసు బనాయించి, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పెంచకుండా నాన్చుతున్నారన్నారు. కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి మాసం కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. సర్వేలు చేస్తున్నాం.. కమిటీలు వేస్తున్నామని సమయం వృథా చేస్తూ పబ్బం గడుపుతోందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టడం ఖాయమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పద్మా వెంకటేశ్, బాసంపల్లి పోచాగౌడ్, త్రినేశ్ గౌడ్, కోవూరు వెంకటేశ్, పిట్ల సత్యనారాయణ, ముద్దగల్ల రాజు ఉన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడికి ఆహ్వానం

బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయకమిటీ

రామాయంపేట, జనవరి 17: గోదాసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు, బీఆర్ఎస్ మెదక్ అసెంబ్లీ నియోజకర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి ఆహ్వాన పత్రికలను ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం అందజేశారు.

**గోదానంలో పాల్గొనాలని ఎంపీకి ఆహ్వానం**

చిన్నశంకరంపేట, జనవరి 17: మండలంలోని ఖాజాపూర్ తండాలో ఆదివారం నిర్వహించే గోదానం కార్యక్రమానికి రావాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావ్‌కు సానీక్షా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ ఆహ్వానించారు.

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్పీ



బ్యాంకు మేనేజర్లతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

మెదక్ అర్బన్,జనవరి17: బ్యాంక్ ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి వ్యూహాత్మకంగా బ్యాంకుల ఎదుట, లోపల, సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మెదక్‌లోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో బ్యాం కు మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేయడాని కి, చొరబాట్లను గుర్తించడానికి ఆధునిక అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏటీఎంలకు డబ్బు తీసుకుని వెళ్లేటప్పుడు సెక్యూరిటీ సిబ్బందికి కేటాయించిన ఆయుధాన్ని కలిగి ఉండి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎంలో అలారం, సీసీ కెమెరాల పనితీరును ఎల్లప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు అనిపిస్తే సెక్యూరిటీ సిబ్బంది వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

# సారు.. సమయానికి రారు

- ఉదయం 11గంటలైనా విధులకు హాజరుకాని ఎంపీడీవో
- విధి నిర్వహణలో కొరవడిన చిత్తశుద్ధి

ఉదయం 11 గంటలకూ ఖాళీగా ఉన్న ఎంపీడీవో కుర్చీ

శివ్వంపేట, జనవరి 17: ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం కిందిస్థాయి అధికారులతో గ్రామాల్లో ఉదయం నుంచే సర్వే చేస్తుంటే శివ్వంపేట ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తా మాత్రం సమయపాలన పాటించడం లేదు. ఉదయం 11 గంటలైనా విధులకు హాజరుకాలేదు. కార్యాలయానికి వెళ్లిన విలేకరులు ఎంపీడీవోకు ఫోన్ చేయగా తాను శభాష్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఉన్నానని చెప్పారు. వెంటనే శభాష్‌పల్లికి వెళ్లి చూస్తే సర్వేలో పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. అతడిని అడుగగా తాను ఉదయం నుంచి గ్రామంలో సర్వే చేస్తున్నానని, ఇక్కడికి ఏ అధికారి రాలేదని తెలిపారు. అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇష్టం వచ్చినప్పుడు రావడం, సమయానికి ముందే వెళ్లిపోవడం అధికారులకు పరిపాటిగా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి కొరవడిందని తెలుస్తున్నది.

## రెడ్డిపల్లి కేజీబీవీలో గెస్ట్ అధ్యాపకులకు ఆహ్వానం

చేగుట, జనవరి 17: రెడ్డిపల్లి కేజీబీవీలో పీజీఆర్‌టీ, సీఆర్‌టీ ఇంగ్లిష్ బోధించేందుకు గెస్ట్ అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవాణి శుక్రవారం తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, సమాచారం కోసం 7660931789 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

## కన్నకొడుకు హత్య చేసిన తండ్రి

మనోహరాబాద్, జనవరి 17: రోజూ తాగొచ్చి వేధిస్తుండటంతో కన్న తండ్రే కుమారుడిని హత్య చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగారెడ్డిపేటలో జరిగింది. సీఐ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. లింగారెడ్డిపేట్‌కు చెందిన మాదాస్ శ్రీకాంత్ (30) మద్యానికి బానిసై రోజూ కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి మాదాసు శ్రీకాంత్ తండ్రి దుర్గయ్యతో ఘర్షణకు దిగాడు. అనంతరం నిద్రలోకి జారుకున్న శ్రీకాంత్‌ను దుర్గయ్య కత్తితో నరికిచంపేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగకృష్ణ తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ వేగవంతం చేయాలి

అల్లాదుర్గం, జనవరి 17: ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని వెయ్యి గొంతుకలు-లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన రాష్ట్ర కోఆర్డినేటర్ డప్పోల్ల రమేశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జనన్నగారి బల్‌రాం ఆధ్వర్యంలో అల్లాదుర్గంలో మాదిగల ధర్మ యుద్ధ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. కాలేజీ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు నిర్వహించారు. సూర్యకుమార్, బాల్‌కిషన్, నర్సింహులు, ఇమ్మయ్య, పోచయ్య, దుర్గయ్య, రమేశ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి దుబ్బాక ఎమ్మెల్యే పరామర్శ

చేగుట, జనవరి 17: గుండెపోటుతో మృతి చెందిన నార్సింగి మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, మాజీ జడ్పీటీసీ బాణాపురం క్రిష్టారెడ్డి, సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఆకుల మల్లేశంగౌడ్, నవీన్, భూపతి రాజ్ తదితరులున్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, జనవరి 17: బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని జంగరాయి గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి తండ్రి అంజిరెడ్డి మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అంజిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. చందాపూర్‌లో దుర్గపతి నానమ్మ మృతి చెందింది. చిన్నాగౌడ్ తల్లి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు మాజీ సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరియాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతిప్రభాకర్, రమాదేవి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, నాయకులు స్వామి, బాగారెడ్డి, సురేశ్, నర్సింలు, సుధాకర్, శేఖర్ గౌడ్, రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశానికి ఆహ్వానం

నర్సాపూర్, జనవరి 17: రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025ను నిర్వహించనున్నట్లు ఎంఈవో తారాసింగ్ తెలిపారు. దీనికి చివరి తేదీ ఫిబ్రవరి 1 అని, పరీక్ష తేదీ ఫిబ్రవరి 23 గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మీసేవలో, సీఎస్‌సీ సెంటర్లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రేపటి నుంచి చాముండేశ్వరీ ఆలయ వార్షికోత్సవాలు



చాముండేశ్వరీ ఆలయం

చిలిపిచెడ్, జనవరి 17: మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీరా నది తీరాన వెలిసిన చాముండేశ్వరీ ఆలయ 42వ వార్షికోత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అమ్మవారికి సంపూర్ణ మహాజలాభిషేకం, జపాలు, పారాయణాలు, మహాపూజ, మహా నివేదన, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందని చాముండేశ్వరీ సేవా సమితి శక్తి మండల సభ్యుడు శోభన్, ప్రధాన పూజారి ప్రభాకర్‌శర్మ తెలిపారు.

## వైభవంగా భోగ్ బండార్

భోగ్ బండార్‌లో ప్రేమ్‌సింగ్ మహరాజ్‌తో తండాప్రజలు

నిజాంపేట, జనవరి 17: మండలంలోని ఖాసీంపూర్ తండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో ప్రజలు భోగ్ బండార్‌ను శుక్రవారం వేర్వేరుగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ శిష్యుడు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం చేశారు. విఠల్‌నాయక్, మైపాల్‌నాయక్, లచ్చిరామ్‌నాయక్, రాంచందర్‌నాయక్, హన్మనాయక్, రాంచందర్‌నాయక్, మేతీరాం, సుమన్, దేవేందర్‌నాయక్, సుభాశ్‌నాయక్ ఉన్నారు.

## బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్



శేఖర్‌ను శాలువాతో సన్మానిస్తున్న కృష్ణయ్య

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 17: రాష్ట్ర బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ శేఖర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య నియమించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేసి సన్మానించారు.

## గుండెపోటుతో ఐటీ ఉద్యోగి మృతి

యాదగిరి (ఫైల్)

చిన్నశంకరంపేట, జనవరి 17: గుండెపోటుతో ఐటీ ఉద్యోగి మృతి చెందిన ఘటన మండలంలోని ఖాజాపూర్‌లో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుగుణ, ఆగమయ్య దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి యాదగిరి, మహేశ్ ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు మహేశ్ మెదక్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద కుమారుడు యాదగిరి(39) బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం అస్వస్థతకు గురయ్యాడు. భార్యముని దవాఖానకు తీసుకెళ్లింది. శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి కూతురు సాహితి, కుమారుడు మనీ ఉన్నారు.